...మరణం ధ్రువమ్...!



మల్లాది సూరిబాబు

'పెద్దబాబుగారు మీరు ఒక్కసారి యిల్లా రావాలి' అని ఆ కుర్రవాడు రామచంద్రయ్యగారితో అన్నాడు,

ఆయన కూర్చున్న చోటునుంచి కదలకుండానే 'దేనికి?' అని అడిగాడు. చెప్పడానికి కుర్రవాడు క్షణకాలం సందేహించాడు.

'ఏం జరిగింది?' అని ఆయన కళ్లతోనే ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు సమాధానంగా ఆ కుర్రవాడు 'కాకులు' అని అన్నాడు.

'ఏమిటి?'

కాకులు...

'నాకు తెలుసు నాయనా! నాకు తెలుసు.'

కుర్రవాడు ఏం మాట్లాడలేదు

రవ్వంత దూరంలో తెరలుకట్టిన బండి వెళ్లిపోతోంది.

ఎటు చూసినా నిశ్శబ్దం! నిశ్శబ్దం!

ఒక ముసలివాడు రామచంద్రయ్యగారి దగ్గరకు వచ్చి, నిలబడ్డాడు.

'బండి ఇంటికి వెళ్లిపోతోంది' అని అన్నాడు.

'గది గుమ్మంలో దీపం వుంచమను.'

'పెద్దబాబుగారు!' అని ఆ కుర్రవాడు మళ్లీ అన్నాడు. రామచంద్రయ్యగారు ఉలిక్కిపడ్డారు. కుర్రవాడి వెంట నడిచి వెళ్లారు. అక్కడ అంతా యీయనకోసం కనిపెట్టుకుని వున్నారు. తూర్పుదిక్కున వేపచెట్టుమీద, కాలువ ఒడ్డున మర్రిచెట్టుమీద కాకులు దండిగా కూర్చున్నాయి.

రామచంద్రయ్యగారు వెనక్కి తిరిగి చూశారు. గుడ్డలుకట్టిన బండి రోడ్డు మలుపు తిరిగి కనుచాటయింది.

కాకి కావు! కావు! మని అరిచింది.

'నాయనా శంకరం నువ్వు ఏ దిగులు పెట్టుకోకు నాయనా. అన్నీ నీ యిష్ట ప్రకారమే జరుగుతాయి. రా నాయనా భోజనం చెయ్యి.'

శంకరంలో ఏం చలనం లేదు.

మాకు ఎవ్వరికీ నీమీద కోపంలేదు నాయనా! నువ్వు నన్ను అన్యాయం చేశావని నేను అనుకోవడంలేదు.'

శంకరం ముందుకు సాగలేదు.

మనస్సులో ఏదో ఆలోచన మసలింది. కంటనీరు తిరిగింది.

'నీ మనస్సు నాకు తెలుసు శంకరం. శ్యామలకు ఏ లోటూ రానివ్వను, శ్యామలను వివాహం చేసుకోమని నేను స్వయంగా ప్రార్థిస్తాను. వాళ్లకు కలిగిన బిడ్డను నేను పెంచుకుని నా ఆస్తి అంతా యిస్తాను. శ్యామలను ఒప్పిస్తాను నాయనా.

నామాట వినవూ! చాలా దూరం ప్రయాణం చెయ్యాలి. మారాం చెయ్యకుండా భోజనం చెయ్యి నాయనా!'

శంకరం తండ్రిమాట కాదనలేక పోయాడు.

గోలగా చెట్టుమీద కాకులు ఒక్కసారి లేచాయి. ఎగిరివచ్చి నేలమీద వాలాయి. విస్తరిలో మెతుకు మిగల్చకుండా తిని వెళ్లిపోయాయి, ఎల్లా వచ్చిందో ఎప్పుడు వచ్చిందో, ఒక ఆవు వచ్చి విస్తరి నమిలి తినివేసింది.

'ఇంత ఆకలిగా వుంటె తిననని మారాంచేస్తే ఎల్లా వా తండ్రి! చూడు ఎల్లా వుండే వాడివి ఎల్లా అయి

పోయావో...'

ఇంటిదగ్గర వందలాదిగా వచ్చిన బ్రాహ్మణ సమూహంలోంచి ఒక వృద్ధ బ్రాహ్మణుడు రామచంద్రయ్యగారిని చూడగానే నమస్కారం చేసి

'బాబు వేదం యెనభైనాలుగు పన్నలు క్షుణ్ణంగా చదివినవాడిని...' అంటూ ఏదో చెప్పబోయాడు.

ప్రక్కనున్నవాళ్లు 'ఊరుకోవయ్యా సబబు సందర్భం తెలియాలి...' అని మందలించారు.

రామచంద్రయ్యగారు అతనివంక ఒక క్షణం మౌనంగా చూశారు. పెదవిమీద చిరునవ్వు కనిపించింది.

'దక్షిణ ఎక్కువ కావాలి అంతేనా ?' అని అన్నారు

ముసలి బ్రాహ్మణుడు ఏం మాట్లాడ లేదు.

ఆ పేటలోని ఆడా మొగా అంతా గుంపులు గుంపులుగా వచ్చి వెడుతున్నారు.

అందరిలోకి పెద్దావిడ వెడుతూ ఇంకొక చిన్నావిడతో

'ఆ దీపంలో రవ్వంత నూనె పోయవే. వచ్చేవాళ్లు ఇంకా చాలామంది వున్నారు' అని అంది.

'నాకు భయంగా వుంది అత్తయ్యా' అని ఆ మనిషి సమాధానం చెప్పింది.

'అన్ని పనులకి నేనే చావాలి !' అని అంటూ విసుక్కుంటూ ముసలావిడ లోపలికి వెళ్లింది.

ముసలాయన పందిట్లోకి రాగానే పంక్తులు తీర్చి కూర్చున్న జనం ఒక్క క్షణం మూగబోయారు.

ప్రక్కనున్న మనిషివంక చూశి ఆయన తల వూపాడు. వడ్డన ప్రారంభమైంది. ఆ పదార్థాలకి ఆ ఆధరువులకి అంతం లేదు. ఆ రుచికి లోటు లేదు.

అప్పుడే క్రొత్తగా వైదికంలో ప్రవేశించిన బాల బ్రహ్మచారి ప్రక్కనున్న నడికారు మనిషితో—

'పెళ్లి భోజనంకన్నా బాగుంది మామా!' అని అన్నాడు.

'నోరు మూసుకోరా శుంఠా !' అని మామ మందలించాడు.

భోజనం చేస్తున్న పంక్తుల మధ్య నుంచి రామచంద్రయ్యగారు మెల్లిగా నడుస్తున్నారు.

'అయ్యా, కాలాతీతం కాలేదు. నింపాదిగా భోజనం చెయ్యండి. సంతృప్తిగా భోజనం చెయ్యండి' అని అన్నారు.

ఎవరికి వారే మనస్సులో చిత్తం! చిత్తం! అని అన్నారు.

పందిరి చివర ఒక చిన్న అమ్మాయి పువ్వుల పువ్వులగౌను వేసుకుని వుంది. ఈయన్ని చూడగానే ఎత్తుకోమని చేతులు జాచింది. రామచంద్రయ్యగారు లాలనగా ఆ పిల్లని ఎత్తుకున్నారు.

'తాతయ్యా! నాకు లడ్డూగావాలి' అని అంది.

మరుక్షణం, పాప చేతిలోకి, లడ్డూ వచ్చింది.

'మనింటో పెళ్లా, తాతయ్యా?'

'అవునమ్మా!'

'ఐతే మరి అమ్మ నాకు క్రొత్త బట్టలు కుట్టించలేదేం?'

'కుట్టిస్తుందిలే తల్లీ.'

'అత్తయ్య నాతో మాట్లాడటం లేదు తాతయ్యా!'

'మాట్లాడుతుందిలే అమ్మా.'

'రెండో వరుసలోకి అన్నం రావాలి' అని ఎవరిదో గొంతుక వినిపించింది.

'పెళ్లికొడుకు ఏడి తాతయ్యా!'

తాతయ్య ఏం మాట్లాడలేదు.

'మాట్లాడవేం తాతయ్యా!'

తాతయ్య ఉలిక్కిపడ్డాడు.

'ఏమిటమ్మా'

'పెళ్లికొడుకు ఏడి తాతయ్యా!'

'వూరు వెళ్లాడమ్మా'

'భలేవాడే పెళ్లి అవుతూవుంటే వూరికి వెళ్లాడా?'

'సరోజా!!' అంటూ ఒక ప్రౌఢ కంఠం వినిపించింది.

సరోజ వాళ్ల అమ్మ దగ్గరకు పరుగెత్తుకుని వెళ్లింది.

'చిన్నదాని మాటలు పట్టించుకోకండి బాబు' అని ఎవరో అన్నారు.

'దైవం మనతో మాట్లాడేది వాళ్ల ద్వారావే' అని రామచంద్రయ్యగారు మనస్సులో అనుకున్నారు.

'భోజనకాలే భగవన్నామస్మరణ గోవిందా! గోవిందా!' అని భక్తుడొక్కడు కేక పెట్టాడు.

బ్రాహ్మణుల భోజనాలు అయ్యాయి. తాంబూలాలు దక్షిణలు యధావిధిగా ముట్టాయి.

అరగంట గడవకుండానే భోజనాల సావిడి కడగటం, గుడ్డలు పెట్టి తుడవటం, చూస్తూ వుండగానే, నీటి చుక్క మిగలకుండా ఆరిపోవడం అంతా జరిగిపోయింది.

ముత్తైదువులు వచ్చి ముగ్గులు వేశారు. బ్రాహ్మణులు సభగా కూర్చున్నారు. రామచంద్రయ్యగారు తనకు వీటితో ఏం సంబంధం లేనట్టుగా చూస్తూ వూరుకున్నారు.

'తమరు ఒక్కసారి యిలా దయ చేయాలి' అని ఆయన్ను ప్రార్థించారు.

'దేనికి?'

'ఆశీర్వచనం ప్రారంభించుతారుట.'

'ఎవరినిరా ఆశీర్వదించేది?'

వచ్చిన మనిషి ఏదో చెబుదామని అనుకున్నాడు, కాని రామచంద్రయ్యగారి వంక చూసి మాట్లాడకుండా వూరుకున్నాడు.

వచ్చిన బ్రాహ్మణులలో ఒక పండు ముదుసలి 'బాబు సాంప్రదాయంగా వస్తున్నవి మనం మానెయ్యడానికి వీలులేదు' అన్నాడు.

రామచంద్రయ్యగారు ఏం మాట్లాడ లేదు.

'బతికి వున్న వాళ్లకే బాధలు, బాధ్యతలు, బాధతో కూడింది కనుకనే బాధ్యత అని అన్నారు. ఆచరించక తప్పదు'.

'ఎంతకాలం యీ బాధ్యతలు?'

'బతికి వున్నంత కాలం!'

రామచంద్రయ్యగారు మాట్లాడకుండా వచ్చి పీటలమీద కూర్చున్నారు.

బ్రాహ్మణులు ఆశీర్వచనం ప్రారంభించపోతున్నారు. ఆపమని రామచంద్రయ్యగారు సౌంజ్ఞ చేశారు.

'ఇప్పుడు మీరు యీ యింటికి వచ్చిన అరిష్టం తొలగిపోయి మళ్లీ మంచి రోజులు రావాలని కోరడమనే లాంఛనం జరిపించబోతున్నారు. ఇది ఎంత అసంగతంగా వుంటుందో, యీ కాండ ఎంత అసందర్భంగా వుంటుందో, మీ అందరికీ తెలిసిందే. ఈ యింటికి వచ్చిన అనర్థం తీర్చి, మళ్లీ మంచి రోజులు తెప్పించటం ఎవరికి సాధ్యం?

ఎండిమోడైన వృక్షం చిగురించి మళ్లీ ఫలిస్తుందా!

మొదలు తెగిన తీగె ఎక్కడైనా బ్రతుకుతుందా?

అది దైవానికే సాధ్యం కాదే? మానవులకి ఎల్లా సాధ్యం? దైవమే సాధించలేనిది మానవుడు సాధించగలడా? ఒకవేళ సాధించగలిగితే దైవం, సమాజం హర్షిస్తాయా?

ఈ ఇంటికి, ఇక్కడి వ్యక్తులకు కావలసింది ప్రాయశ్చిత్తం.

ఏ జన్మలోనో ఎవరికో ఘోర అపకారం చేసినందువల్ల కాబోలు నాకున్న యీ సర్వ సంపదలు యీనాడు యిల్లా వ్యర్థమైయ్యాయి.

దైవం లేని ఆలయానికి ఎన్ని అలంకారాలు చేస్తే ఏం లాభం!

నన్ను గురించిన బాధ నాకు ఏనాడు లేదు. నేను బాధ పడేదల్లా సర్వస్వం పోగొట్టుకున్న ఆ అదృష్టహీనురాలిని గురించే.

కర్మ పరిపక్వం లేక పాప లేశమేదో ఋణ శేషంగా మిగిలితే, ఆ ఋణం తీర్చుకుని, తన బాధ్యత వదిలించుకుని, వెళ్లిపోయినవారు అదృష్టవంతులే, కాని ఇక్కడ నిలచిన నాలుగు నాళ్లలోనే నేనూ నావాళ్లూ అంటూ భవబంధాలు ఏర్పరుచుకుని, క్రిందటి జన్మలోని ఋణవిముక్తి కోసమని వచ్చి, యీ జన్మలో క్రొత్త సంకెళ్లని తగిలించుకుని వాటిని త్రెంచలేక, గతాన్ని విస్మరించలేక, మనస్సు మథనమై పోగా, జాగృతికి సుషుప్తికి దూరమై పోగా, వెలుగు నీడల మధ్య క్షోభలో నలిగి, బాధతో దుఃఖంతో స్వర్గానికికూడా అయిష్టంగా వెళ్లిన ఆ ఆత్మకు శాంతికావాలని దీవించండి, ఒకటికి పదిసార్లు ఆశీర్వదించండి.'

రామచంద్రయ్యగారు ఒక్కసారి వాళ్ల వంక కలయజూచాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. అంతా శిలాప్రతిమలలాగా ఆయన వంక చూస్తూ కూర్చున్నారు.

'ముందు జరగవలసిన కార్యక్రమం ఏమిటి? ఇక్కడినుంచి బయట పడటం ఎల్లా?'

ఇటువంటి రకరకాల ప్రశ్నలతో మనస్సులు పరుగు లెత్తుతున్నాయి. ఆ ఇల్లంతా మౌనం ఆవరించింది.

ఎటుచూచినా పిడుగుపడ్డంత నిశ్శబ్దం!

'బాబుగారు నేనొక్క మనవి చెయ్యవచ్చునా' అని అంటూ ఒకనడికారు మనిషి లేచి నిలబడ్డాడు.

'చెప్పండి.'

'మీ మనస్సులోని బాధ మాకు తెలియనిదికాదు. ఈ సుఖ దుఃఖాలకు మనమే కర్తలమనే అపోహవల్లనే కదా యీ మానసిక వ్యథ. మనంకూడా నిమిత్తమాత్రులం అని గ్రహించిన రోజున, యీ బాధలు భరించడం రవ్వంత యింకా తేలిక అవుతుందేమో!'

'రాలిపోవడానికి సిద్ధంగావున్న నేను, వేదాంతంలో నన్ను నేను ఓదార్చుకోవచ్చు. కాని చిగురించే లేలేత వయస్సులో, కుమిలి పోయేవారిని ఓదార్చడం ఎల్లా?'

'అన్నిబాధలకు అన్ని గాయాలకు ఒకటే మందు.'

'ఏమిటది ?'

'కాలం!'

'పడగొట్టిన్న లేత తీగే వర్షాకాలం వచ్చేదాకా తట్టుకుంటుందా ?

'పడగొట్టిన ప్రాణికి సేద తీర్చవలసిన బాధ్యత మనదే, సేదతీరిన ప్రాణికి, మనసు తేలిక అయితే, మళ్లి చిగురించాలని అదే కోరుకుంటుంది. ఆనాడు దానికొక ఆలంబన చూపిస్తే అది విరబూసి మూడు పువ్వులు ఆరు కాయలు అవుతుంది.'

'సంఘం ఒప్పుకుంటుందా!'

మన మతాన్ని సరైనదృష్టితోచూసి నెమ్మదైన మనస్సుతో ఆకళింపు చేసుకోండి. ప్రకృతికి విరుద్ధంగా మానవుడిని బ్రతకమని ఏమతం ఏ ఆచారం శాసించదు.'

'మరి యీనాడు?'

విజ్ఞాన వివేక రహితులైన మూర్ఖులే మతానికి ఆచారానికి అపార్థాలు కలిపించి మానవజాతికి తీరనిఅపకారం చేస్తున్నారు.'

'పోయినవారి ఆత్మ యీ అనాచారాన్ని హర్షించదేమో!'

'వైతరణి దాటడానికి ఆయత్తమవుతున్న ఆత్మ, యీ మర్త్య లోకంలోని కట్టుబాటులని గురించి బాధపడుతుందని మీరనుకుంటున్నారా ?'

'ఐతే యీ కార్మకాండ, యీ ఆచారం, ఉపయోగం'

'మన మనశ్శాంతికి.'

'మరి యీ దుఃఖం ? యీవేదనా?

'క్షణికం'

'అంతేనా ?'

'అంతే'

రామచంద్రయ్యగారు తలవంచుకుని మౌనంగా కూర్చున్నారు. బ్రాహ్మణులు యీ సంకేతాన్ని గ్రహించారో ఏమో ? వేదఘోషలో, ఆవాడ వాడంతా నిండిపోయింది.

1968 లో మీ అదృష్టము

మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు సంవత్సరంలో జరుగు

ముఖ్య సంఘటనలు అనగా వ్యాపారంలో లాభనష్టాలు, సర్వీసులో ప్రమోషన్ ట్రాన్స్‌ఫర్లు, పిల్లల జననం, వివాహం ముఖ సంతోషాలు మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజిఅదనం ఒకసారి చూచి తృప్తి చెందగలరు.

PT. DEV DUTI SHASTRI
Raj Jyotshi, (APM) P.B 86,
JULLUNDUR CITY.

ఏజెంట్లు కావలెను

35% కమిషన్‌మీద ప్రఖ్యాతి నేషనల్ డీలక్స్, ఆల్ వరల్డ్



పోర్టబుల్ ట్రాన్సిస్టర్ల విక్రయించుటకు ఏజెంట్లు కావలెను శాంపిలు ట్రాన్సిస్టర్‌కై నేడే వ్రాయండి

ROMER AGENCIES,
P.O Box 1441, (ASVP-27)
Delhi—6



లిచెన్సా

వాడండి

DZ-1613 CR-TG

...మరణాంధ్రపమ్

అనుకున్నదానికంటె ఎక్కువగానే సంభావనలు పొంది బ్రాహ్మణులు వెళ్లిపోయారు.

వచ్చిన బంధుకోటి ఎవ్వరితోను చెప్పకుండా తమ తమ నెలవులకు తరలిపోయారు.

నిశ్శబ్దం రామచంద్రయ్యగారికి తోడుగా మిగిలింది, సావిడిదాటి యింట్లోకి వెళ్ళారు.

ఒక ముత్తైదువ నడవలో కూర్చొని వుంది.

'శ్యామల ఎక్కడవుంది?' అని రామచంద్రయ్యగారు అడిగారు.

'గదిలో పడుకునివుంది'

గది గుమ్మందగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. గదిలో నేలమీద, పసుపూ కుంకుమకు నోచుకోని ఆ పడుచుపిల్ల పడుకునివుంది.

'తల్లీ!' అని పిలిచారు.

ఆ అమ్మ పలుకలేదు.

గదిలోకి వెళ్లబోయిన మనిషి వెనక్కి తిరిగారు. పూజగృహంలోకి దారితీశారు.

ఇన్నిరోజులుగా పూజా పునస్కారంలేక ఆగదిలోని దేముడుకూడా ఉపవాసాలు చేసినవాడిలాగా కళాకాంతులు లేకుండా వున్నాడు.

రామచంద్రయ్యగారి మనస్సులోంచి వేడినిట్టూర్పు వచ్చింది. అంతలోనే మనస్సులో ఏదో ఆలోచన మసలింది. అడుగు వెనక్కి తిరిగింది.

పుస్తకాల గదిలోని రామాయణం తెరిచారు. చదవటం మొదలుపెట్టారు.

మరణించిన ఇంద్రజిత్తుతో సహగమనం చెయ్యటానికి, సతీసులోచన చితిపై కూర్చోంది. ఈదృశ్యాన్ని చూసిన రావణాసురుడు.

'మీ ఇద్దరికి యీ మహాసామ్రాజ్యాన్ని పట్టంగట్టి, మీరు సకలవైభవోపేతంగా రాజ్యంచేస్తూవుంటే, మనస్సున నిశ్చింతతో, నిండిన ఆనందంతో నేను నా ధర్మపత్నితో వానప్రస్థం స్వీకరించుదామని ఎన్నాళ్లగానో ఎదురుచూశాను. కాని విధి వక్రించింది. ఈనాడు మీయిద్దరిని యింధన సింహాసనంపై కూర్చోపెట్టి స్వర్గలోక సామ్రాజ్యానికి పట్టం గడుతున్నాను తల్లీ!'

ఆపుస్తకం మూసేసి బీరువాలో పెట్టేశారు. ఇంకొక పుస్తకం తెరిచారు. ఆయన కంటబడిన వాక్యం.

'నాయనా లోహితా!'

ఆయన మనసులో మసలిన మాట—

'నాయనా శంకరం!'

నాయనా శంకరం! ఎందుకు నాయనా ఇంత అన్యాయంగా ప్రవర్తించావు! మేము ఏం అపకారం చేశామని, ఇంత కోపంగా హఠాత్తుగా వెళ్లిపోయావు!

ఇరవైఆరుసంవత్సరాల క్రితం యీ ఇంట్లోనే ఒక్కసారిగా వెయ్యి దీపావళి పండుగలు జరిగినంత ఆనందం కలిగింది. మా ఇలవేల్పు సాక్షాత్తు పరమశివుడే యీ రూపంలో యీ ఇంట్లో వెలిశాడనిపించింది. మేము చేసిన పూజలు ఫలించాయి.

జీవితంలో సగ భాగం గడిచిపోయి, ప్రొద్దు వాటారబోతున్న మా బ్రతుకులోకి చల్లని చందమామలాగా వచ్చావు.

ఆనాడు మా మనుగడకు ఒక అర్థం, మా జీవితాలకు ఒక ఉపయోగం కనిపించాయి. మా జీవితాలు వ్యర్థమేమోనని ఇంతకాలం బాధపడిన నేను, గొడ్రాలు అనే మాయని మచ్చతో జీవితమంతా గడపవలసి వస్తుందేమోననే బాధతో అనుక్షణం పూజలతో పునస్కారాలతో తపించిపోయిన మీ అమ్మ నోముల పంటలాగా మా యింట్లో వెలిశావు.

ఆనాడు మా మనస్సులలో ఎటు చూసినా వెలుగే, వెన్నెలే! పెళ్లికంటె వైభవంగా నీ బారసాల జరిపించాము. నీ జాతక చక్రం వేసిన జోస్యులవారు ఏమన్నారో తెలుసా?

ఈ చిరంజీవి తన పేరు చిరస్థాయిగా నిలుపుకుంటాడు అని. నీకు గుర్తుందా నాయనా శంకరం, నీ అక్షరాభ్యాసానికి రాజాగారిని అడిగి ఏనుగు తీసుకుని వచ్చాను.

నిన్ను ఆశీర్వదించడానికి వచ్చిన పండితులు ఏమని దీవించారో జ్ఞాపకం వుందా?

'సకల విద్యా ప్రాప్తిరస్తు!'

నిజమే నాయనా సకల విద్యలు నీకు అబ్బినాయి. స్కూలు ఫైనలులో రాష్ట్ర

ములో మొదట వాడివు నీవేగా!

పీ. యూ. సీ. లో విశ్వవిద్యాలయంలో క్రొత్త రికార్డు స్థాపించినవాడివినువ్వేగా.

ఎమ్. ఎ. లో గోల్డు మెడలు నీకేగా వచ్చింది.

నీకు మంచిచదువు వచ్చిందంటే అది మీ అమ్మ చేసిన అదృష్టం అని అనుకున్నాం.

నీకు మంచి ఉద్యోగం వచ్చిందంటే అది నీ భార్య చేసిన పూజా ఫలం! అని అన్నారు.

పెళ్లిలో మీ యిద్దరిని చూశినవారు ఏమన్నారో తెలుసా? రతీ మన్మధులలాగా వున్నారని.

మీ అమ్మ ఎప్పుడూ అదృష్టవంతురాలే. రాములవారివంటి కుమారుడిని కన్నది. సీతమ్మ వారిలాంటి కోడలును తెచ్చుకుంది! అన్ని ఆనందాలు చూచుకుని ఇంత పసుపూ కుంకంతో వెళ్లిపోయింది. సర్వస్వం మీకు అప్పచెప్పి యీ విధుర జీవితం భగవన్నామస్మరణలో గడుపుదామని మభ్యపడ్డాను.

ఇందరి ఆశలు నమ్మకాలు తప్పని అడియాశచేసి నువ్వు వెళ్లిపోయావు.

ఎందుకని శంకరం?

నీ మనస్సు నొప్పించే పని ఏదైనా చేశామా నాయనా? నీవాళ్లమీదనే ఎందుకయ్యా ఇంత కోపం!

'జాతస్య మరణం ధృవమ్!' అని నాకూ తెలుసు శంకరం. కాని నేను ముందుగా వెళ్లడం న్యాయం. ఔచిత్యం కూడా అదే.

కాని యిలా సంఘ విరుద్ధంగా నువ్వు వెళ్లిపోతే అందరికీ ఎంత బాధాకరంగా వుంటుందో నువ్వే చెప్పు!

పోనీ నేనంటే పరాయివాడిని! నీలో సగభాగమైన ఆ యిల్లాలని చూడవయ్యా! లేతవయస్సులోని మనిషిని యిల్లా చెయ్యడం అన్యాయం కాదా శంకరం!'

'పెద్ద బాబుగారు! పెద్ద బాబుగారు!' అంటూ ముత్తైదువ కంఠం వినిపించింది.

రామచంద్రయ్యగారు ఉలిక్కిపడి 'ఏమిటి!' అని అన్నారు.

'అమ్మాయి మాట్లాడటంలేదు'

రామచంద్రయ్యగారు ఒక్కంగలో ఆ గదిలోకి వెళ్లారు. 'అమ్మా శ్యామలా ఇటు చూడుతల్లీ! అని గద్గదస్వరంతో పిలిచారు.

అంతా నిశ్శబ్దం!

శ్యామల పలకలేదు. కన్నెత్తి చూడలేదు. రామచంద్రయ్యగారు శ్యామల ప్రక్కనే నేలమీద కూర్చున్నారు.

'అమ్మా శ్యామలా!' అంటూ ఆ పిల్ల ముఖంవంక చూశారు.

ఏదో చెప్పబోయారు.

వెయ్యి కంఠాలతో ఎవరో చెబుతున్నట్లు అనిపించింది. వెయ్యి చేతులతో ఎవరో కంఠాన్ని నొక్కినట్లు అనిపించింది.

బిగపట్టిన పిడికిలిలో తెల్లటి కాగితం మీద నల్లటి అక్షరాలు కనిపించాయి. నిండు పున్నమిలాంటి శ్యామల వదనంలో అమావాస్య కప్పివేసింది.

కట్టె వున్నది కాని హంస లేదు.

హృదయాన్ని చీల్చుతూ కట్టలు తెగిన శోకాన్ని దాటుకుంటూ రామచంద్రయ్యగారి నోటివెంట ఒకొక్క వాక్యం వెలువడింది.

'సహగమనం చేశావా తల్లీ!!' ●